క్లుప్తంగా

వైభవంగా కలశ స్థాపన పూజలు

సిద్దవటం : మండల కేంద్రం పరిధి దిగువపేటలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం కలశ స్థాపన పూజలు వేదపండితులు వెంకటరంగయ్య స్వామి వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా బుధవారం గోపూజ, గంగాదేవి పూజ, దీక్షా హోమం, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, జలాదివాసం వంటి పూజా కార్యక్రమాలను జరిపించారు.

రాజ్యసభ సభ్యుడు మేడాకు ఘన సన్మానం



మేడాను సన్మానిస్తున్న దేవస్థాన నిర్వాహకులు

రాజంపేట : రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి బుధవారం భువనగిరిపల్లె శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్వాహక ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి గర్భగుడికి వెండితాపడం కోసం ఐదుకేజీల వెండిని వితరణగా మేడా ఇచ్చారని కొనియాడారు. తాను వితరణ ఇవ్వడమే కాకుండా తన మిత్రుడు దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డిలు ఆలయానికి ఒక కేజీ వెండి వితరణగా ఇచ్చారన్నారు. వారి కుటుంబానికి స్వామి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో భువనగిరిపల్లెకు చెందిన గ్రామపెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

రాయచోటి టౌన్ : 104 సిబ్బంది గ్రామాలలోని నిరుపేద రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉషశ్రీ సూచించారు. బుధవారం 104 నిర్వహణ సంస్థ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ రీజనర్ మేనేజర్ ఇక్బాల్ హుస్సేన్ తన సిబ్బందితో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం 104 ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ శేషశయనా రెడ్డి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి



చిట్వేలి: విజేతకు బహుమతి అందిస్తున్న ఎంఈఓ ఈశ్వరయ్య

చిట్వేలి/చిన్నమండెం/సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంఈఓలు తెలియజేశారు. బుధవారం ఆయా మండలాల్లోని వంట ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. వంటలు చేసేటప్పుడు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ వంట పాత్రలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి మంచి బియ్యం వస్తాయన్నారు. వంటలు చేసే వారు అంకితభావంతో రుచిగా చేసి విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓలు వివరించారు. అంతకుముందు వంట ఏజెన్సీ నిర్వాహకులకు పోటీలు నిర్వహించి రుచికరంగా వండిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఎంఈఓ-2 ఈశ్వరయ్య, చిన్నమండెం మండల రిసోర్స్ పర్సన్ షబానా, సుండుపల్లె మండల ఎంఈఓ-2 రవీంద్రనాయక్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తాం

ఓబులవారిపల్లె : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. ఎక్కడైనా గంజాయి, నాటుసారా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

రాయచోటి టౌన్ : బక్రీద్ పండుగ శాంతియుత వాతావరణంలో నిర్వహించుకొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అర్బన్ సీఐ బివి చలపతి సూచించారు. బుధవారం రాత్రి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషనలో హిందూ పీస్ కమిటీ సభ్యులతో పాటు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నిర్వహించుకొనే పర్వదినం అన్నారు. ఆ పండుగను శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు సహకరించాలని కోరారు. అలాగే ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు హిందూ సామ్రాజ దినోత్సవ ర్యాలీ నిర్వహణ ఉన్నందని హిందూ పీస్ కమిటీ సభ్యులు తెలియచేయడంతో ఈ కార్యక్రమాన్ని కూడా శాంతికి విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని తెలిపారు.

కదిలొచ్చారు.. కదంతొక్కారు

- 'వెన్నుపోటు దినం' నిరసనకు వెల్లువెత్తిన ప్రజానీకం
- కూటమి ఏడాది పాలనలో అమలుకాని హామీలు
- ప్రభుత్వ తీరుపై సాధారణ ప్రజల మండిపాటు
- రైల్వేకోడూరులో ప్రధాన రోడ్లన్నీ వైఎస్సార్‌సీపీ జెండాల మాయం
- ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు



కోడూరులో జరిగిన ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రైల్వేకోడూరు అర్బన్ : ఏడాది పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు, రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడమే కాక ఉన్న పథకాలు పీకేసి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మండిపడ్డారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయం నుంచి కడప పార్లమెంట్ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డితో కలసి కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్, బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని.. అధికారంలోకి చేపట్టాక పథకాలు ఎగ్గొట్టి పేదల జీవితాలకు మినిమం గ్యారెంటీ లేకుండా చేశారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఉచిత బస్సు, అమ్మకు వందనం, ఆడబిడ్డకు నెలకు 1500, డ్వాక్రా మహిళలకు 10 లక్షల వరకు 0 వడ్డీ, నిరుద్యోగ భృతి 3000, 50 ఏళ్లకే పింఛన్, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు, ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆరాచక పాలనకు తెర లేపారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ సారథ్యంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్ సంకల్పంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అటు అభివృద్ధి చేయక ఇటు సంక్షేమ పథకాలు ఇవ్వకపోగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులు ఎక్కడికి పోయాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, గుత్తిరెడ్డి హరినాథ్‌రెడి, తోట శివసాయి, జిల్లా యువజన అధ్యక్షులు ఎలగచర్ల శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, అన్వర్‌బాషా, మార్శెల రాజేశ్వరి, భరత్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, నందబాల, ముస్తాక్, డీవీ రమణ, సుబ్బరామరాజు, సిద్దు, బండారు మల్లి, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొరముట్ల, అజయ్‌రెడ్డి, నాయకులు

ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు



దుకాణాలను తొలగించాలని తెలియజేస్తున్న ఎస్ఐ, ఎంపీడీఓ, రెవెన్యూ సిబ్బంది

ఓబులవారిపల్లె : ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో దుకాణాలతో ఆక్రమణలకు గురవుతుందని వైద్యాధికారి గురు మహేష్ ఇటీవలే పోలీసులకు రెవెన్యూ, పంచాయతీరాజ్ వారికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు బుధవారం సాయంత్రం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని, నిర్దేశించిన గడువులోపు పూర్తి ఆక్రమణలు తొలగించాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మహేష్ అన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జరిపిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్ రెడ్డి, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన



రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలో నిర్మిస్తున్నటువంటి రైల్వే అండర్ బ్రిడ్జి పనులను రాజ్యసభ సభ్యులు మేడ రఘునాథరెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ నేపథ్యంలో స్థానికులు ఆయనతో మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయాలని అండర్ బ్రిడ్జి నందు పాదచారులకు, వృద్ధులకు, స్కూల్ విద్యార్థులకు, మహిళలకు అనుకూలంగా ఉండేలా ఫుట్‌పాత్ నిర్మించాలని, అంతేకాక వర్షం వస్తే నీరు నిలువకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఆర్ఎంకి వినతిపత్రాన్ని అందించవలసినదిగా ఎంపీని కోరారు. ఇక్కడి పనులపై రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నాయనపల్లి అనుదీప్ జయసింహ, శ్రీధర్‌గౌడ్, సోమిశెట్టి ప్రభాకర్, నవాబ్‌జాన్, గుణయాదవ్, కాకి చంద్ర, నాగసుబ్బయ్య, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

మండలంలోని అరవపల్లెలో వెలసిన శ్రీ కోదండ రామాలయ పునర్నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి రూ.5 లక్షలు వితరణగా అందజేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నాగిరెడ్డిపల్లెలోని మారెమ్మ తల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంప సుధాకర్, నడివీధి సుధాకర్, మహేష్, ఆకుల చలపతి, దుర్గారెడ్డి, అనుదీప్ జయసింహ, కరీముల్లాఖాన్, సోమిశెట్టి ప్రభాకర్, పల్లె మాధవి, పెనుబాల నాగసుబ్బయ్య, స్వామి ఎలుమల్లై, గుణయాదవ్, అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, విజయుడు, కాకి చంద్ర, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గుండు గోపాల్‌రెడ్డి, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగిసిపడిన ప్రజా వ్యతిరేకత

- రాజంపేటలో 'వెన్నుపోటు దినం'కు తరలివచ్చిన జనం, వైఎస్సార్‌సీపీ క్యాడర్
- హామీలు నెరవేర్చే దాక ఉద్యమం ఆగదంటూ స్పష్టీకరణ
- సబ్ కలెక్టరేట్ వద్ద పోలీసుల అత్యుత్సాహం



నిరసనలో ఎంపీ మేడా, ఎమ్మెల్యే ఆకేపాటి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, చైర్మన్ పోలా, మదన్‌రెడ్డిలు

రాజంపేట : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం యేడాది పూర్తయిన క్రమంలో 'వెన్నుపోటు దినం'గా ప్రకటించిన సందర్భంగా పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని పాతబస్టాండులో ముందుగా దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఆకేపాటి సోదరుడు అనిల్‌రెడ్డిలు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పాత బస్టాండు నుంచి ముకుందర గడ్డ, కర్నాటక లాడ్జి సర్కిల్, దీప్‌లాడ్జి, సాతుపల్లె క్రాస్, రాజంపేట - రాయచోటి ఆర్వోబీ మీదుగా రాజంపేట సబ్‌కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీకి స్వచ్ఛందంగా జనం తరలివచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా క్యాడర్ కదిలివచ్చింది. కాగా సబ్‌కలెక్టరేట్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పట్టణ సీఐ రాజా తన సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. అనంతరం ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, చైర్మన్ పోలా, వైస్ చైర్మన్ మర్రి రవికుమార్‌లు సబ్‌కలెక్టరేట్‌కు వినతిపత్రం అందచేశారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

రాజంపేటలో వేలాది మందితో కొనసాగిన ర్యాలీ రాజంపేట వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం నింపింది. ప్రజల పక్షాన ఉద్యమాలు, పోరాటాలు తామెప్పుడు ముందుంటామని శ్రేణులు చెబుతున్నాయి. ర్యాలీలో జై జగన్ జై జగన్.. జై వైఎస్సార్‌సీపీ నినాదాలతో నాయకులు, కార్యకర్తలు హోరెత్తించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో రావడంతో రాజంపేటలోని ప్రధాన మార్గం వైఎస్సార్‌సీపీ జెండాల మయమైంది.

నిరసన ర్యాలీలో ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి మేనల్లుడు మదన్‌రెడ్డి, రాజంపేట నుంచి చొప్పా ఎల్లారెడ్డి, జెనుగు కృష్ణారావు యాదవ్, భాస్కర్‌రాజు, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, దాసరి పెంచలయ్య, దండు గోపి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, సనిశెట్టి సురేష్, సుబ్బరాజు, జావిద్ అలీ, బిల్లా నరేష్, మహిళా నేతలు మిర్యాల సురేఖ, రక్కాసి శ్రీవాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, నందలూరు నుంచి ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, భూమన శంకర్‌రెడ్డి, పొత్తపి చంద్ర, మోహన్‌రెడ్డి, గాలా సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, అరిగెల నాని, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, మైనార్టీ నేత కలీం, మహిళా నేతలు పల్లె మాధవి, వాణి, లక్ష్మీదేవి.. వీరబల్లి నుంచి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వీరనాగిరెడ్డి, వివేకానందరెడ్డి, మండల కన్వీనర్ మణిరాజు, సురేష్‌స్వామిలు పాల్గొన్నారు. సిద్దవటం నుంచి మహిళా నేత ఏకుల రాజేశ్వరరెడ్డి, నాయబ్ రసూల్, వలిఖాన్, కేవీ సుబ్బయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, సయ్యద్‌నూర్, ఆలం కృష్ణచైతన్య, వావిళ్ల శ్రీనివాసరెడ్డి, బూచి రాజశేఖర్‌రెడ్డి, ఒంటిమిట్ట మండలం నుంచి కన్వీనరు టక్కోలు శివారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగం సుబ్బారెడ్డి, కూండ్ల ఓబుల్ రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలుతోపాటు వివిధ మండలాలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకోవడంపై పోలీసులను ప్రశ్నిస్తున్న పోలా శ్రీనివాసులరెడ్డి, మర్రి రవి

టీబీకి భయపడాల్సిన పనిలేదు

లక్కిరెడ్డిపల్లి : టీబీ వస్తే రోగులు భయపడాల్సిన పనిలేదని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని స్థానిక రామాలయంలో ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు జరిగే వంద రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దగ్గు, రెండు వారాలు జలుబు, జ్వరం, రాత్రి సమయంలో చెమటలు పట్టడం, గళ్లలో రక్తం పడటం, చాతిలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడవాపు వంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. 60 ఏళ్ల వయస్సు ఉన్న వారు మధుమేహ వ్యాధిగ్రస్తులు, హెచ్ఐవీ, ధూమపానం, మద్యపానం, పాత టీబీ రోగులకు ఎక్సరే, ఆర్టీసీఆర్, సీటీ నాట్ ద్వారా పరీక్షలు చేస్తామన్నారు. ఉచితంగా మందులను అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు సుభాషిణి, టీబీ సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నయవంచక పాలనపై పోరు.. పెల్లుబిక్కిన హోరు

- పోలీసుల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ నిరసనలో భారీగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- కూటమి విధ్వంసక పాలనను వ్యతిరేకిస్తూ నినాదాలు
- ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ గళం



వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాయచోటి : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రోడ్లపైకి వచ్చి ఉత్సాహంగా కూటమి ప్రభుత్వ పాలన చేసిన వెన్నుపోటు రాజకీయాలకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కథనోత్సవంతో విజయవంతమైంది. రాయచోటి కలెక్టరేట్ సమీపంలోని అన్నమయ్య రింగ్ రోడ్డు సర్కిల్ నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాల మోతలతో కదం తొక్కారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉరకలెత్తిన ఉత్సాహంతో కార్యకర్తలు గర్జన చేశారు. ఉత్సాహంగా జెండాలు చేతబూనిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నేతలతో కలిసి కూటమి ప్రభుత్వంపై నిరసనల గళం విప్పారు. కూటమి నాయకుల అరాచకాలు, దాడులు, తప్పుడు కేసులకు జడియకుండా వైఎస్సార్‌సీపీ నేతలు ధైర్యంగా, ఉత్సాహంగా ముందుకు రావడం విశేషం. ఒక ఏడాదికే విసుగు చెందిన కార్యకర్తలు, ప్రజలు పూనకం వచ్చినట్లు రోడ్లపైకి వచ్చి కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని విధాలుగా విఫలమయ్యారంటూ విమర్శలు గుప్పించడం కనిపించింది.

డీఆర్‌ఓకు వినతిపత్రం

వెన్నుపోటు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన శాంతి ర్యాలీ నిరసన కార్యక్రమాలు అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మధుసూదన్ రావుకు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, పార్టీ బీసీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్, పార్టీ నాయకులు యదుభూషణ్ రెడ్డి, అంపాబత్తుని రెడ్డన్న, గోవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీలు వెంకటేశ్వరరెడ్డి, వెంకటరమణ, ఉపేంద్ర రెడ్డి తదితరులు డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

మండుటెండను లెక్క చేయకుండా

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వెన్నుపోటు కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మండుటెండను లెక్కచేయకుండా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు చాలా ఉత్సాహం నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు.

బెదిరించినా ఆగని అభిమానం..

వెన్నుపోటు దినంలో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు ద్వారా అధికార పార్టీ నాయకులు హెచ్చరించినా వైఎస్సార్‌సీపీ నాయకుల్లో భయం కనిపించలేదు. ఇప్పటికే కూటమి పాలనలో భాగమైన టిడిపి నాయకుల దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు కారణంగా వైఎస్సార్‌సీపీ నాయకులు భయకంపితులను చేసిన విషయం తెలిసిందే. గత రెండు రోజులుగా రాయచోటి పరిధిలోని పోలీసుల నుంచి పలువురు ఆ పార్టీ నాయకులకు ఫోన్‌ల ద్వారా నోటీసులు ఇస్తున్నామని, వెన్నుపోటు దినంలో పాల్గొనరాదని హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నుంచి వచ్చిన ఆదేశాలతో పోలీసులు ఇచ్చిన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ నిరసనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని కదంతొక్కారు.



ప్లకార్డులతో నిరసనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- పది రోజులపాటు వైభవంగా నిర్వహణ
- కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి



ఉత్సవాలకు సిద్ధమైన వేణుగోపాల స్వామి ఆలయం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. వేణుగోపాలుడు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమని ఇక్కడి ప్రజల నమ్మకం. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని ధర్మకర్త జిలకర సుబ్బయ్య, పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య స్వాములు తెలిపారు. ఈనెల ఐదవ తేదీ అంకురార్పణ కార్యక్రమాన్ని పాలెంపల్లి, న్యూజెర్లవారు ఉదయం దాతలుగా వ్యవహరిస్తారని, 6న ధ్వజారోహణ, నెమలి వాహన సేవను ఒడియరాజులు ఉభయదాతలుగా వ్యవహరిస్తారని, అలాగే 7న నాయుడు సంఘం వారు శేష వాహనం, 8న పంచేటి వారు సింహ వాహనం, 9న రెడ్డి సంఘం వారు గరుడ వాహనం, 11న గొనేని వారు కల్యాణోత్సవం, గజవాహనం, 12న రథోత్సవం బలిజ సంఘం వారు, 13న ఆర్యవైశ్య సంఘం వారు అలకల తోపు, అశ్వ వాహనం, 14న పాలిశెట్టివారు ధ్వజావరోహణ, హంస వాహనం, వసంతోత్సవం 15న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు. ప్రతిరోజూ హరికథ కాలక్షేపం, వివిధ కుల సంఘాల వారు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కదిలిన పల్లెలు.. హోరెత్తిన పట్టణాలు



సుండుపల్లె: వెన్నుపోటు దినం కార్యక్రమానికి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కార్యక్రమానికి బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంబేపల్లె మండలం నుంచి కాన్వాయ్‌గా వస్తున్న కార్యకర్తలు

వీరబల్లి నుంచి వందలాదిగా తరలిన శ్రేణులు

వీరబల్లి : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమం ర్యాలీలో పాల్గొనడానికి వీరబల్లి మండలం నుండి నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో బుధవారం తరలివెళ్లారు. మండల వైఎస్సార్ సిపి నాయకులైన ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యువ నాయకులు మదన్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డిల ఆధ్వర్యంలో మండలం నుంచి పెద్దసంఖ్యలో కేడర్ ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా పెద్దసంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొననున్నట్టు నాయకులు తెలిపారు. అధికారమే పరమావధిగా ఇచ్చిన హామీలను ఆర్థికంగా వీలుకావడం లేదని చెప్పడాన్ని నాయకులు తప్పుబట్టారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రశ్నించే విధంగా పోరు చేస్తామని చెప్పారు.